క్లుప్తంగా

గడి బాపనమ్మ తల్లి ఆలయంలో శాంతి హోమం



శాంతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గంగవరం: గిరిజనుల ఆరాధ్య దైవం మాతృశ్రీ గడి బాపనమ్మ తల్లి ఆలయంలో సోమవారం శాంతి హోమం నిర్వహించారు. గంగవరం శివారులో వేంచేసిన బాపనమ్మ తల్లి ఆలయం వద్ద గంగవరం రాందాసు మహిళా కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పోతురాజు, కోసు రామకృష్ణ దంపతులతో కొత్తపల్లి అర్చకుడు శ్రీనివాస్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి హోమంలో పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే..



జి.మాడుగులలో వాహన రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్

జి.మాడుగుల: వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేదంటే ఎంవీఎం చట్టం ప్రకారం కేసులు తప్పవని ఎస్‌ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. జి.మాడుగుల–పాడేరు, నుర్మతి మార్గాల్లో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం జంక్షన్ వద్ద పోలీసులతో కలసి ఆయన వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ మార్గాల్లో తిరిగే వాహనాలను, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితులను ప్రశ్నించి వదిలి పెట్టారు. వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సు, ఇతర రికార్డులను వెంట ఉంచుకోవాలని సూచించారు. సామర్థ్యాన్ని మించి ప్రయాణికులను ఎక్కించుకుని అతివేగంగా నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని, సీటు బెల్టు, హెల్మెట్లను తప్పనిసరిగా వినియోగించాలన్నారు.

లోతేరు ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు



హెచ్‌ఎం శెట్టి నారాయణరావు

అరకులోయ రూరల్: మండలంలోని లోతేరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు శెట్టి నారాయణరావు సోమవారం తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు ముందుకు రావాలన్నారు. ప్రైవేట్‌కు దీటుగా గత ప్రభుత్వంలో నాడు–నేడుతో సుందరంగా అభివృద్ధి చేశామన్నారు. పాఠశాలలో 3వ తరగతి–40, 4వ తరగతి–40, 5వ తరగతి–30, 6వ తరగతి–20, 7వ తరగతి–20, 8వ తరగతి–20, 9వ తరగతి–15 చొప్పున ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. పూర్తి సమాచారం కోసం 9493541315కు సంప్రదించాలని కోరారు.

శ్రీనివాసరావు సేవలు మరువలేనివి



సభలో మాట్లాడుతున్న పార్టీ కార్యదర్శి ఐ.వి

ఎటపాక: సీపీఎంకు, ప్రజాసేవకు కందుల శ్రీనివాసరావు చేసిన సేవలు మరువలేనివని మండల కార్యదర్శి ఐ.వి తెలిపారు. సోమవారం నందిగామలో ఉప సర్పంచ్ శ్రీనివాసరావు మూడో వర్ధంతి సందర్భంగా స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. కరోనా సమయంలో ప్రజలకు సేవలందిస్తూ ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా తన ప్రాణాలను పోగొట్టుకున్నారని గుర్తు చేశారు. ఆయన మరణాన్ని గ్రామస్తులు నేటికీ జీర్ణించుకోలేకపోతున్నారని ఆవేదన చెందారు. ఆయన స్ఫూర్తితో పార్టీ కార్యకర్తలు సేవాభావాన్ని అలవర్చుకుని ముందుకు సాగాలన్నారు. పులుసు బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పులుసు సూర్యనారాయణ, వీరమ్మ, సొండె రామారావు, హరి, సతీష్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

చింతపల్లి రూరల్: స్థానిక విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 19న సీజీఆర్‌ఎఫ్, ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఏఈ వనుము ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో వినియోగదారులు హాజరై సమస్యలను తెలియజేసి పరిష్కారం పొందాలన్నారు.

ఘనంగా సరువుల ఊరేగింపు

దేవార్ల పూనకాలతో ఊరేగిన పోతురాజు



సరువులను ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

వీఆర్‌పురం: రాజుల(కొండ్రాజుల) జాతరలో సరువుల ఊరేగింపు కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. రేఖపల్లిలో కొండరెడ్డి, నాయకపోడు గిరిజనులు మూడేళ్ల కొకసారి నిర్వహించే ఈ జాతర ఈ నెల 8న ప్రారంభమైంది. కొలుపుల జాతర మొదట జెండా పండగతో ప్రారంభమై వివిధ పూజలు, నైవేద్యాలతో కొనసాగి కొండాలు(అగ్ని గుండం)తొక్కడంతో పూర్తవుతుంది. శతాబ్దాలుగా ఈ వేడుకలను ఈ ప్రాంత నాయకపోడు గిరిజనులు ఎన్ని అవాంతరాలు ఎదురైనా లెక్కచేయకుండా క్రమం తప్పకుండా నిర్వహిస్తూ వస్తున్నారు. జాతరలో కీలకమైన సరువుల ఊరేగింపునకు అత్యధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో పూర్తిస్థాయి కళ సంతరించుకుంది. పూర్వాచారం ప్రకారం గట్టు ముసలమ్మ దేవతకు కోడిపుంజులను బలిచ్చిన అనంతరం జాతర నిర్వాహకులు తెల్లవారు జామున అడవికి వెళ్లి పొడవాటి మూడు సరువులను (సంద్ర చెట్లను) గుర్తించారు. వాటిని మొదలు వేర్లతో సహా వెలికితీసి గొల్లబజారులో ఉంచారు. అక్కడే ఆ వృక్షాలను శుద్ధి చేసి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అదే ప్రదేశం నుంచి దేవారుల పూనకాల మధ్య డప్పు, డోలు వాయిద్యాలతో పోతురాజు పూజారి కత్తి చేతబూని సరువుల చెట్లపై ఆసీనుడైన అనంతరం జాతర నిర్వహించే ప్రదేశానికి తోడ్కొని వెళ్లారు. అక్కడ రాత్రంతా పూజార్లు పలు రకాల పూజలు నిర్వహించారు.

తదనంతరం అర్ధరాత్రి సమయంలో ఆ చెట్లలో రెండు చెట్లను పుల్లలుగా నరికి వాటితో గద్దె ముందు కొండాలు (అగ్నిగుండాన్ని) తయారు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. అదే సమయంలో మిగిలిన మరో సరువు చెట్టును సంప్రదాయంలో భాగంగా చెరువులో నిమజ్జనం చేశారు. సంతాన లేమితో బాధపడే మహిళలు గద్దె వద్ద జాతర ముందు రోజు రాత్రి నిద్ర చేస్తే సంతానం కలుగుతుందని ఇక్కడ వారందరూ గట్టిగా విశ్వసిస్తారు. మంగళవారం ఉదయం గద్దె వద్ద నిర్వహించే అగ్ని గుండం కార్యక్రమాన్ని వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు.

మలేరియా నిర్మూలనకు ముందు జాగ్రత్త చర్యలు





చవిటిదిబ్బలులో ఫాగింగ్ చేస్తున్న సచివాలయ శానిటేషన్ వర్కర్లు

వై.రామవరం: మండలంలో మలేరియా నిర్మూలనకు ఎంపీడీవో కె.బాపన్నదొర ఆదేశాల మేరకు ఈవోపీఆర్డీ శివకుమార్ పర్యవేక్షణలో ముందు జాగ్రత్త చర్యలు కొనసాగుతున్నట్లు స్థానిక పంచాయతీ కార్యదర్శి మధుసూదనరాజు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం చవిటి దిబ్బలు గ్రామంలో ఫాగింగు ప్రారంభించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది,

సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధి గ్రామాల్లోను ఫాగింగు ప్రారంభించినట్లు ఈవోపీఆర్డీ తెలిపారు.

సంతబయలు వీధిలో తీరిన తాగునీటి కష్టాలు

- గ్రామస్తుల ఆనందం



తాగునీరు అందడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

పెదబయలు: మండలంలోని రూడకోట గ్రామ పంచాయతీ సంతబయలు వీధిలో సర్పంచ్ కాతారి సురేష్‌కుమార్ బోర్‌వెల్‌కు మోటార్ ఏర్పాటు చేసి తాగునీటి కష్టాలు తీర్చారని గ్రామస్తులు సొలగల బాలరాజు తదితరులు తెలిపారు. మూడు నెలల క్రితం తాగునీటి ఎద్దడి ఉందని గుర్తించి బోర్ తీయించారన్నారు. ఎన్నికల కోడ్ వల్ల జాప్యమైందని, రెండు రోజుల నుంచి బోర్‌వెల్‌కు మోటార్ బిగించి తాగునీరు అందించిన సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్తి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్



పూర్తి నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్న గిరిజన రైతులు

గూడెంకొత్తవీధి: ఎన్‌హెచ్ 516ఈ రోడ్డుకు ఇరువైపులా కాఫీ, మిరియాల మొక్కలకు పూర్తి నష్టపరిహారం చెల్లించాలని మండలంలో పెదవలస, చాపరాతిపాలెం, రంపుల గ్రామాల గిరిజన రైతులు డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ గతంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభంకాక ముందు కొలతలకు, ఇప్పుడు కొలతలకు చాలా మార్పులు ఉన్నాయని, దానివల్ల నష్టపరిహారం చెల్లించిన దానికంటే అదనంగా భూమిని కోల్పోతున్నట్టు తెలిపారు. ఏపీఎఫ్‌డీసీ అధికారులు ఇచ్చిన అంచనాల ప్రకారం తక్కువ మొక్కలు రికార్డులో నమోదు చేశారన్నారు. వాస్తవానికి అంతకు మించి కాఫీ, మిరియాలు మొక్కలు పోతున్నాయని వాపోయారు. ఈ విషయమై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతున్నారు.

ధ్వంసమైన గృహాల పరిశీలన



రాజుపేటలో పరిశీలిస్తున్న తహసీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్

వీఆర్‌పురం: మండలంలో ధ్వంసమైన గృహాలను తహసీల్దార్ సయ్యద్‌మౌలానా ఫాజిల్ సోమవారం పరిశీలించారు. ఆదివారం సాయంత్రం సంభవించిన గాలివాన బీభత్సానికి రాజుపేట, వీఆర్‌పురం, వడ్డిగూడెం, రేఖపల్లి తదితర గ్రామాల్లోని పలు గృహాల పై కప్పులు ధ్వంసమయ్యాయి. పలు ఇళ్లపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. బాధితుల వివరాలు సేకరించి నమోదు చేసుకున్నట్టు ఆయన చెప్పారు. ఉన్నతాధికారులకు నివేదించి నష్టపరిహారం అందేలా చూస్తామని తెలిపారు.

ఘనంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వారు

రాజవొమ్మంగి: స్థానిక కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయం వద్దకు చుట్టు పక్కల గ్రామాల భక్తులు అశేషంగా తరలివచ్చి పూజలు, భజనలు చేశారు. భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు, పుష్పార్చనలు జరిగాయి. అనంతరం కల్యాణం వైభవంగా జరిపించారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. పలు కార్యక్రమాలతో ఆలయం వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

ఓం నమో వేంకటేశాయ



వజ్ర కవచం, తులసి, పూల మాలలతో వెంకన్న అలంకరణ



ధ్యాన మందిరంలో మూలవిరాట్‌కు నిర్వహిస్తున్న క్షీరాభిషేకం



కలశాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

- కశింకోట వెంకన్నకు విశేష అభిషేకాలు

కశింకోట: కశింకోటలోని వేంకటేశ్వర స్వామి ధ్యాన మందిరంలో సోమవారం స్వామికి క్షీర, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. జేష్ఠ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని చేపట్టిన కల్యాణోత్సవాల్లో భాగంగా మూడు గంటలకు పైగా కార్యక్రమాన్ని జరిపారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో మొదటగా గణేష్ పూజ, విశ్వక్షేన పూజ నిర్వహించారు. అనంతరం నవ కలశాలను ఏర్పాటు చేసి వాటిలో ఒక్కో దానిలో భక్తులు సమకూర్చిన పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, పసుపు, కుంకుమ, చందనం, నగదు నాణేలు వేర్వేరుగా నింపి వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, తర్వాత పంచామృత అభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. చివరిగా నాణేలతో అభిషేకించారు. అనంతరం స్వామిని వజ్ర కవచాలంకృతులను చేశారు. పూలమాలలు, తులసి మాలలతో అందంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఆద్యంతం తిలకించారు. పూజా కార్యక్రమాల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఊరిస్తున్న వర్షాలు...మండే ఎండలు



నక్కపల్లిలో జ్యూస్ షాపు వద్ద వివిధ రకాల పండ్లను అందుబాటులో ఉంచిన దృశ్యం



వేంపాడు టోల్‌గేట్ వద్ద విక్రయిస్తున్న కొబ్బరి బొండాలు

నక్కపల్లి : ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ వర్షాలు లేక వాతావరణంలో మాత్రం మార్పు కనిపించడం లేదు. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు చాలా తీవ్రంగా ఉంటున్నాయి. ఉపాధి పనులకు వెళ్లే వారు తొమ్మిది గంటలకే ఇంటి ముఖం పడుతున్నారు. జాతీయరహదారిపై రాకపోకలు సాగించే వారు ఎండధాటికి తట్టుకోలేక తలకు గుడ్డలు చుట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దుకాణాలను మధ్యాహ్నం 12 గంటలకల్లా మూసి సాయంత్రం ఐదుదాటితే తప్ప తెరవడం లేదు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు జాతీయరహదారిపై సేదతీరేందుకు ఎటువంటి సదుపాయాలు లేక ఇక్కట్లు పడుతున్నారు. టోల్‌గేట్ పరిసర ప్రాంతాలతో పాటు, పాయకరావుపేట నుంచి అనకాపల్లి వరకు జాతీయ రహదారికి ఇరువైపులా కొబ్బరి బొండాల విక్రయాలు జోరందుకున్నాయి. గిరాకీ పెరగడంతో బొండా రూ.30ల చొప్పున విక్రయించారు. బొప్పాయి, పైనాపిల్ పండ్లను ముక్కలుగా కోసి కవర్లలో పెట్టి విక్రయిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



జోలపుట్టులో ముస్లింలు



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రాజవొమ్మంగి: బక్రీద్ పండుగను ముస్లింలు సోమవారం రాజవొమ్మంగిలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక రెహమానియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హాత్ మిలా అంటూ ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పేదలకు గుప్త దానాలు చేశారు. చుట్టపక్కల గ్రామాల నుంచి వచ్చిన ముస్లింలు పెద్ద ఎత్తున నమాజులో పాల్గొన్నారు.

అడ్డతీగల: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక జామియా మసీదులో ముస్లింలు మత ప్రార్థనలు చేశారు. జామియా మసీదు అధ్యక్షుడు షేక్ హజరత్ ఆధ్వర్యంలో గురువు అబ్దుల్ రజాక్, పెద్ద ఎత్తున తరలివచ్చిన ముస్లింలు ప్రార్థనలు చేశారు. పరస్పరం ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని, దాని ప్రాముఖ్యతను గురువు అబ్దుల్ రజాక్ వివరించారు. ఏపీసీసీ కార్యదర్శి దంగేటి సత్తిబాబు ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ముంచంగిపుట్టు: మండలంలోని జోలపుట్టులో బక్రీద్ పండగను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీద్‌లో ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అరకు ఎంపీ, ఎమ్మెల్యేలకు ఘన సన్మానం



అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి, వినయ్, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంలను సన్మానిస్తున్న గిరిజన ఉద్యోగుల సంఘం నేతలు

సాక్షి,పాడేరు: భారీ మెజార్టీతో విజయం సాధించిన అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి, అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంలకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించింది. అరకు ఎంపీ, ఎమ్మెల్యేలకు దుశ్శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, పలు సంఘాల నాయకులు ముఖి శేషాద్రినాయుడు, పలాసి సింహాచలం, రేగం అనిల్‌కుమార్, సంజీవరావు, చెల్లయ్య, కోడా ఈశ్వరరావు, గిడ్డి వరలక్ష్మి, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతపల్లి, జి.కె.వీధి నేతల అభినందన

అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ దంపతులకు చింతపల్లి, జి.కె.వీధి ప్రజాప్రతినిధులు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ హలియారాణీ అభినందించారు. చింతపల్లి, జి.కె.వీధి ఎంపీపీలు కోరాబు అనూషాదేవి, బోయిన కుమారి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యపడాల్, పార్టీ మండలాధ్యక్షుడు మోరి రవి, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మండల అధ్యక్షురాలు దురియా పుష్పలత, ఎంపీటీసీలంతా ఎంపీ తనూజరాణి, వినయ్‌లను దుశ్శాలువాలు కప్పి అభినందించారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చింతూరు: మండలంలోని కాటుకపల్లిలో పిడుగు పడి ఇల్లు దగ్ధమైన బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం రూ.10 వేల సాయం అందించారు. ఈ ఘటనలో సోడె నాంచారమ్మ ఇల్లు దగ్ధం కావడంతో సర్వస్వం కోల్పోయింది. దీంతో జెడ్పీటీసీ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, పార్టీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి ఇక్కడ దగ్ధమైన ఇంటిని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పాయం చంద్రయ్య, కారం కన్నారావు, ఉప సర్పంచ్ భూక్యా బాబూరావు, యూత్ కన్వీనర్ మడివి రాజు, ఎస్టీ సెల్ కన్వీనర్ పీసం పొదయ్య, కారం సాయిబాబా, విప్లవ్‌కుమార్ పాల్గొన్నారు.

సీలేరు బాలికల పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలి

- గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు



మాట్లాడుతున్న ఎంపీటీసీ బుజ్జిబాబు

గూడెంకొత్తవీధి: సీలేరు గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి, గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సీలేరు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి వరకే ఉందని, పదో తరగతికి మరొక పాఠశాలకు మారాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. అక్కడ సీట్లు దొరక్క విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు బాలయ్య, పాంగి బాబూరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

రాజవొమ్మంగి: నేషనల్ హైవే రోడ్ విస్తరణ పనుల్లో భాగంగా రాజవొమ్మంగి 11 కేవీ ఎంహెచ్‌క్యూ ఫీడర్ పరిధిలోని మండలంలోని పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. దివాకర్‌రావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాజవొమ్మంగి, అప్పలరాజుపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. విద్యుత్ లైన్లకు తగిలే చెట్టుకొమ్మలు, జంగిల్ క్లియరన్స్ పనుల్లో భాగంగా జడ్డంగి ఫీడర్ పరిధిలోని డి. మల్లవరం, కింద్ర, లబ్బర్తి, లాగరాయి పరిసర గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మండలంలో మట్టి నమూనాల సేకరణ

నాతవరం: రైతుల భూముల్లో భూసార పరీక్షల్లో భాగంగా మట్టి నమూనాలు సేకరిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి శైలజ తెలిపారు. 1300 మట్టి శాంపిల్స్ సేకరించాలని ఉన్నతాధికారులు నుంచి అదేశాలు వచ్చాయన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేకరించిన నమూనాలను అనకాపల్లి జిల్లా భూసార పరీక్షా కేంద్రానికి తరలిస్తామన్నారు. భూసార పరీక్షల అనంతరం భూమిలో ఉన్న లోపాలను గుర్తించి కార్డులలో నమోదు చేసి రైతులకు అందిస్తామన్నారు. ఆ భూమిలో ఉన్న లోపం మేరకు ఏం వాడాల్లో తెలియజేస్తామన్నారు. రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో లోపాలను తెలుసుకోకుండా ఇష్టారీతిన రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల నేల నిస్సారమవుతోందన్నారు. అందుకే రైతులకు ఎలాంటి ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా మట్టి నమూనా పరీక్షలు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు.